సాక్షి తిరుపతి

బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



సేవకు మరింత ప్రాధాన్యం

ఉద్యోగుల సమస్యలతోపాటు ప్రజాసేవకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ప్రజారవాణా అధికారి సూచించారు. - 8లో



3.5 టన్నుల బియ్యం స్వాధీనం

వెంకటగిరిలో అక్రమంగా నిల్వ ఉంచిన 3.5 టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



జగనన్నది జనరంజక పాలన

సీఎం జగనన్నది జనరంజక పాలన అని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కొనియాడారు. - 8లో

న్యూస్‌రీల్

పరీక్షల విభాగంపై సమీక్ష



అధికారులకు సూచనలిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి సిటీ : శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని పరీక్షల విభాగంపై మంగళవారం వీసీ ఆచార్య శ్రీకాంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. అధికారులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ పరీక్షా విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు సమయపాలన పాటించాలని సూచించారు. పరీక్షల విభాగంపై వస్తున్న విమర్శలపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ప్రశ్నపత్రాల మూల్యాంకనం, ఫలితాల విడుదల జాప్యానికి కారణాలను తెలుసుకున్నారు. పరీక్ష జరిగిన రెండు నెలల్లో ఫలితాలు, మార్కుల జాబితాలతో సహా విద్యార్థులకు అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో పరీక్షల విభాగం డీన్ ఆచార్య కిశోర్, పరీక్షల నియంత్రణాధికారి దామ్లానాయక్, డీఆర్‌లు, ఏఆర్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

చిన్నారులకు కన్నీటి వీడ్కోలు



చిన్నారులకు నివాళులర్పిస్తున్న తహసీల్దార్ వాణిశ్రీ

పాకాల: మండలంలోని ఊటువంక గ్రామంలో నీటి కుంటలో పడి మృతి చెందిన ముగ్గురు చిన్నారులకు గ్రామస్తులు కన్నీటితో వీడ్కోలు పలికారు. సోమవారం పాఠశాల నుంచి వస్తూ గ్రామ సమీపంలోని నీటి కుంటలో పడి ఎస్.తేజేశ్వర్(8), ఎల్.పునిత్(10), ఎల్.కన్నయ్య(9) మృతిచెందిన విషయం విదితమే. మృతదేహాల వద్ద తల్లిదండ్రులు ఆర్తనాదాలు చూపరులను కంటతడి పెట్టించాయి. చిన్నారుల మృతదేహాలకు స్థానిక తహసీల్దార్ వాణిశ్రీ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చిన్నారుల తల్లిదండ్రులను ఓదార్చి భరోసానిచ్చారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 64,512 మంది స్వామివారిని దర్శించుకోగా 23,491 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.69 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టోకెన్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిల్లకూరు: ఆంధ్రప్రదేశ్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఈనెల 23 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చిల్లకూరు గురుకుల కళాశాల ప్రిన్సిపల్ మీరా సాహెబ్ తెలిపారు. మంగళవారం గురుకుల కళాశాలలో ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశం, కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఎంపికలు చేపడుతున్న క్రమంలో అర్హత కలిగిన వారు తమ దరఖాస్తును ఈ నెల 23లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థి పాస్ పొటో, ఆధార్ కార్డు, స్టడీ సరిఫికెట్‌లు పొందుపరచాలన్నారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్ష మార్చి 1న చిల్లకూరులోని గురుకుల పాఠశాలలో ఉంటుందని అన్నారు. అలాగే ఇంటర్ ప్రవేశ పరీక్ష కూడా అదే రోజున మధ్యాహ్నం నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

10 నుంచి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

శ్రీకాళహస్తి: పట్టణంలోని బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 10 నుంచి రెండు రోజుల పాటు జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు డీఈఓ వీ.శేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లోని హెచ్ఎంలు, పీడీలు, ఉపాధ్యాయులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, సీఎంవో సురేష్, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పచ్చ కొట్లుడు!



కొట్టుకుంటున్న జనసేన, తెలుగు తమ్ముళ్లు

తెలుగు తమ్ముళ్లు.. జనసైనికులు పిచ్చకొట్టుడు కొట్టుకున్నారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దుల వర్షం కురిపించారు. కుర్చీలు మడత బెట్టి తన్నుకున్నారు. చేతికొచ్చిన వస్తువుతో చెలరేగిపోయారు. కర్రలతో చావబాదుకున్నారు. తమ అధినేత పవన్ కళ్యాణ్ ఫొటోలు ఫ్లెక్సీలు, బ్యానర్లలో లేవని జనసైనికులు.. తాము చెప్పినట్టు వినడం లేదని టీడీపీ వలంటీర్లు ఒకరిపై ఒకరు దాడులకు తెగబడ్డారు. ఇదంతా ఎక్కడో కాదండోయ్.. సాక్షాత్తు టీడీపీ అధినేత నారా చంద్రబాయుడునాయుడు సమక్షంలోనే. కనీసం వారిని వారించాల్సిన చంద్రబాబు అటు కన్నెత్తి చూడకుండా మిన్నకుండిపోవడం గమనార్హం. దీనికి గంగాధరనెల్లూరులో జరిగిన 'రా కదిలిరా' సభ వేదికైంది.

చిచ్చురేపిన 'రా కదలి రా'

- గంగాధరనెల్లూరు సభలో టీడీపీ, జనసేన ముష్టి యుద్ధం
- కార్యక్రమం ఖరారైనప్పటి నుంచి జనసేన శ్రేణులకు దక్కని గౌరవం
- ఫ్లెక్సీలు, జెండాల్లో పవన్ బొమ్మ లేకపోవడంతో ఆగ్రహం
- బాబు ఎదుటే.. పవన్‌ని సీఎంని చేయాలంటూ జనసేన శ్రేణుల నినాదం
- చంద్రబాబు వస్తున్నారని ఊరూరా ప్రచారం చేసినా సభకు రాని జనం
- తమిళనాడులోని తిరుత్తణి, అత్తింజేరిపేట అద్దె జనాలను తీసుకొచ్చిన వైనం

సాక్షి, తిరుపతి : చంద్రబాబు సొంత జిల్లాలో రా కదలి రా సభ టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య చిచ్చు పెట్టింది. జనసేన శ్రేణులకు సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఇరు వర్గాలు చంద్రబాబు సమక్షంలోనే తన్నుకోవాల్సి వచ్చింది. బాబు కళ్లెదుటే ఇదంతా జరుగుతున్నా ఆయన చూసీచూడనట్లు వెళ్లిపోయారు. సభలో జరుగుతున్న పరిణామాలను గమనించిన ఓ టీడీపీ కార్యకర్త జై జగన్ అంటూ నినదించారు. టీడీపీ వలంటీర్లు అతన్ని పట్టుకుని చితకబాదారు. మొత్తంగా బాబు సొంత జిల్లాలో మంగళవారం జరిగిన రా కదలి రా సభ తుస్ మంది.

అద్దె జనాలే దిక్కు

ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు మంగళవారం గంగాధరనెల్లూరు నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన రా కదలి రా సభలో పాల్గొని ప్రసంగించారు. జిల్లా నేతల మధ్య సమన్వయం లేకపోవడం, జనంలో టీడీపీపై సదభిప్రాయం లేకపోవడంతో సభ పేలవంగా ముగిసింది. చంద్రబాబు సొంత జిల్లా కావడంతో రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా రెండు లక్షల మందితో సభను నిర్వహించాలని భావించారు. అయితే జిల్లా నేతలు జన సమీకరణ విషయంలో ఎవ్వరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. చంద్రబాబు వస్తున్నారని ఊరూరా ప్రచారం చేసినా స్థానికులు కూడా సభకు హాజరు కాలేదు. ఈ విషయాన్ని ముందే గ్రహించిన నియోజకవర్గ ఇన్‌చార్జ్ థామస్ పక్కనే ఉన్న తమిళనాడు రాష్ట్రంలోని తిరుత్తణి, అత్తింజేరిపేట నుంచి మనిషికి రూ.300 ఇచ్చి వాహనాల ద్వారా తీసుకొచ్చారు.

అయోమయంలో థామస్

రా కదలి రా సభను నిర్వహిస్తే అధినేత చంద్రబాబే స్వయంగా అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తారని హామీ ఇచ్చారు. అందుకే రా కదలి రా కార్యక్రమానికి థామస్ భారీ ఎత్తున ఖర్చుచేశారు. ఇంత చేసినా.. చివరికి గంగాధరనెల్లూరు అభ్యర్థి అని చంద్రబాబు ప్రకటించకపోవడంతో థామస్ తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. తను చెబితేనే థామస్ బయోకెమిస్ట్రీ చదివి డాక్టర్ అయ్యాడని బాబు కామెడీ చేశారు. అందుకే గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ని చేశానని ప్రకటించారు. అయితే ఎక్కడా ఎన్నికల్లో థామస్‌ని గెలిపించండి అని ప్రకటించలేదు. మండల టీడీపీ నాయకులకు థామస్ సరైన గౌరవం ఇవ్వకపోవడంతో వారు కూడా అంటీముట్టనట్లు వ్యవహరించారు. మండల నాయకులను చంద్రబాబుకు పరిచయం చేయమని అడిగినా థామస్ పట్టించుకోకపోవడంతో టీడీపీ నేతలు మౌనంగా ఎవరి దారిన వారు వెళ్లిపోవడం గమనార్హం.



జనసేన, తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ



కొట్లాటలో చొక్కాలు చిరిగాయి

జనసైనికులకు తీరని అవమానం

పొత్తులో భాగంగా టీడీపీ–జనసేన కలిసి ఎన్నికలకు వెళ్లాలన్నది అధినేతలు తీసుకున్న నిర్ణయం. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించలేదు. ఒకరంటే ఒకరికి పడడం లేదు. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో విభేదాలు ఉన్నాయి. అందుకు గంగాధరనెల్లూరులో మంగళవారం చోటుచేసుకున్న సంఘటనే నిదర్శనం. జీడీనెల్లూరులో రా కదలి రా సభ నిర్వహించాలని నిర్ణయించిన మొదలు జనసేన శ్రేణులకు ముందస్తు సమాచారం ఉండడం లేదు. పిలవాలి అనే భావనతో చివర్లో మొక్కుబడిగా ఫోన్‌చేసి పిలుస్తున్నారు. సభ సందర్భంగా టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాల్లో జనసేన అధినేత పవన్ ఫొటో, స్థానిక నాయకుల ఫొటోలు లేకపోవడం తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. దీంతో సోమవారం రాత్రి మండల జనసేన అధ్యక్షుడు సురేష్‌రెడ్డి జనసేన జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మంగళవారం సభలో వెళ్తుంటే జనసేన శ్రేణులను టీడీపీ కార్యకర్తలు, వలంటీర్లు అడ్డుకున్నారు. ఆగ్రహానికి గురైన జనసేన శ్రేణులు 'పవన్ సీఎం.. జై పవన్ కళ్యాణ్' అంటూ నినాదాలు చేశారు. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని టీడీపీ శ్రేణులను వలంటీర్లు జనసేన నాయకులు, కార్యకర్తలను ఈడ్చిపడేశారు. దీంతో జనసేన శ్రేణులు తిరగబడడంతో ఇరువర్గాల మధ్య వివాదం తారస్థాయికి చేరింది. జనసేన శ్రేణులు టీడీపీ వలంటీర్లు తరిమి తరిమి కొట్టారు. చంద్రబాబు సమక్షంలోనే ఇంత జరుగుతున్నా వారించకుండా చూసీచూడనట్లు వెళిపోయారు.

ఎంపీడీఓలకు స్థానాల కేటాయింపు

చిత్తూరు కార్పొరేషన్ : ఉమ్మడి జిల్లాకు ఎంపీడీఓలకు స్థానాలను కేటాయించారు. ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన వారికి పోస్టింగ్స్ ఇచ్చినట్లు జెడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి మంగళవారం రాత్రి వివరాలను ప్రకటించారు. నెల్లూరు జిల్లా నుంచి 17మంది, వైఎస్సార్ కడప జిల్లా నుంచి 13 మంది ఎంపీడీఓలు జిల్లాకు రాగా కలెక్టర్ షణ్మోహన్ వారికి జిల్లాలో మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

ఎక్కడెక్కడ ఎవరెవరంటే!

చిత్తూరు జిల్లా : చిత్తూరు జిల్లాలో ఎంపీడీఓలుగా చౌడేపల్లెకి వెంకటేశు, గుడుపల్లెకి గోపి, కార్వేటినగరానికి శ్రీధర్ నాయుడు, నగరికి రవికుమార్‌రెడ్డి, నింద్రకు భవాని, పెనుమూరుకు వెంకటేశ్వరరావు, పులిచెర్లకు సురేష్‌బాబు, పుంగనూరుకు వెంగమునిరెడ్డి, యాదమరికి సింగయ్య, పూతలపట్టుకు ప్రసన్నకుమారి, సోమలకు వరప్రసాద్, వి.కోటకు గోవర్ధన, తవణంపల్లెకి వెంకటేశ్వర్లు, విజయపురానికి బ్రహ్మయ్య, గంగాధరనెల్లూరుకు భాస్కర్‌ను నియమించారు.

తిరుపతి జిల్లాలో..

తిరుపతి జిల్లా: తిరుపతి జిల్లాకు ఎంపీడీఓలుగా బీఎన్ కండ్రిగకు షాలెట్, చంద్రగిరికి సూర్యసాయి, కేవీబీపురానికి శివప్రసాద్, పాకాలకు నాగేంద్రబాబు, రామచంద్రాపురానికి ప్రత్యూష, తొట్టంబేడుకు ఇసాక్ ప్రవీణ్, వడమాలపేటకు సుజాతమ్మ, ఎర్రవారిపాళ్యంకు మధుసూదనరావును నియమించారు.

అన్నమయ్య జిల్లాలో..

అన్నమయ్య జిల్లా: అన్నమయ్య జిల్లాలో బి.కొత్తకోటకు నూర్జహాన్, గుర్రంకొండకు, జగదీశ్వరరెడ్డి, కేవీపల్లెకి రెడ్డయ్య, కలికిరికి రామకృష్ణయ్య, నిమ్మనపల్లెకి మైదిలీ, పెద్దమండ్యంకు వెంకటరామయ్య, తంబళ్లపల్లెకు కృష్ణమూర్తి నియమితులయ్యారు.

భక్తులు సంతృప్తి చెందేలా అర్చకత్వం



మాట్లాడుతున్న శ్వేత సంచాలకులు భూమన్

తిరుపతి(అలిపిరి): భక్తులు సంతృప్తి చెందేలా అర్చకత్వం చేయాలని శ్వేత సంచాలకులు భూమన్ అన్నారు. మంగళవారం శ్రీవేంకటేశ్వర ఉద్యోగుల శిక్షణ సంస్థ(శ్వేత) ఆధ్వర్యంలో మూడు రోజుల పునఃశ్చరణ తరగతులు తిరుపతిలోని ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పునఃశ్చరణ తరగతులతో అర్చకులు పాండిత్యాన్ని సంపాదించవచ్చన్నారు. వైఖానస ఆగమంలోని నిగూఢమైన విషయాలను తెలుసుకుని, భక్తులు సంతృప్తి చెందేలా అర్చకత్వం చేయాలని కోరారు. ఈ తరగతుల్లో ఆరోగ్యసూత్రాలపై శిక్షణ ఇస్తామన్నారు. పాంచరాత్ర, శైవాగమ అర్చకులకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఎస్వీ వేదవర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ ఆగమాలు సాక్షాత్తు భగవంతుడు ఉపదేశించినవని, అలాంటి ఆగమాల్లో పేర్కొన్న విధంగా ఆలయాల్లో సంప్రదాయబద్ధంగా అర్చకత్వం చేయాలని కోరారు. ఇలాంటి పునశ్చరణ తరగతులు అర్చక వ్యవస్థ పటిష్టానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకుల్లో ఒకరైన శ్రీ వేణుగోపాల దీక్షితులు మాట్లాడుతూ కట్టు, బొట్టు సంప్రదాయాలను పాటించి అర్చకులు సమాజంలో ఆదర్శవంతంగా నిలవాలన్నారు. ఇలాంటి పునశ్చరణ తరగతులతో అర్చకుల నైపుణ్యం మరింత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు పి.సీతారామాచార్యులు, టీటీడీ ఆలయాల వైఖానస అర్చకులు పాల్గొన్నారు.

హీరో మోటార్ సైకిళ్ల వితరణ



జెండా ఊపి ద్విచక్ర వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, హీరో మోటార్స్ ప్రతినిధులు

తిరుపతి క్రైమ్: కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా హీరో మోటార్స్ యాజమాన్యం 50 ద్విచక్ర వాహనాలను ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డికి మంగళవారం వితరణ చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ మేరకు ఎస్పీ పచ్చ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఇప్పటివరకు ప్రజా ప్రయోజనాల కోసం రాష్ట్ర పోలీసులకు 200 ద్విచక్ర వాహనాలను హీరో మోటార్స్ యాజమాన్యం అందజేసిందన్నారు. ఇందులో ఒక్క తిరుపతి జిల్లాకే 150 ద్విచక్ర వాహనాల వరకు అందించినట్టు వెల్లడించారు. పోలీస్ శాఖ తరపున హీరో మోటార్స్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఇందులో పృథ్వీ షోరూం అధినేత మోహన్‌రెడ్డి, హీరో మోటార్స్ కార్పొరేట్ హెడ్ కిరణ్ పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం

- 9న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్,తిరుపతి నగర కమిషనర్,డీఎంహెచ్‌వో

తిరుపతి అర్బన్: ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఫిబ్రవరి 9వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రచార పోస్టర్లను తిరుపతి మునిసిపల్ కమిషనర్ అదితిసింగ్, తదితర అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ అవగాహన పోస్టర్లను అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలని చెప్పారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. విద్యాసంస్థల్లో, వైద్య శాలల్లో ప్రదర్శించి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పిల్లలు, కిషోర్ బాలబాలికల కడుపులో నులి పురుగులను నిర్మూలించడానికి ఉచితంగా ఆల్బెండోజోల్ 400 మి.గ్రా మాత్రలను 7వ తేదీ నాటికి సంబంధిత విద్యా సంస్థలకు అందేలా చూడాలన్నారు. జిల్లాలో ఈ మందులు సుమారు 5.40 లక్షల వరకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, అడిషనల్ డీఎంహెచ్ఓ అరుణ సులోచన, డీపీఎంఓ శ్రీనివాసరావు, జిల్లా సర్వే అధికారిని తెజేశ్వరి, రాష్ట్రీయ బాల్ స్వస్థ కార్యక్రమం ప్రాజెక్ట్ అధికారిణి డాక్టర్ పద్మావతి, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిణి జయలక్ష్మి, డీఈఓ వీ.శేఖర్, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య పాల్గొన్నారు.

ప్రసూతి మరణాలకు స్వస్తి చెప్పండి

ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసూతి మరణాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో జరిగిన ప్రసూతి మరణాలపై సంబంధిత కుటుంబ సభ్యులు, చికిత్స అందించిన డాక్టర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లతో ఆయన ఆడిట్ నిర్వహణ చేపట్టారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చిన్నపాటి పొరపాటుకు తావులేకుండా ప్రసవ సమయంలో నియమావళి మేరకు వైద్యపరీక్షలు జరిపి తల్లి, బిడ్డ క్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆగస్ట్ 23 నుంచి నవంబర్ 23వ తేదీ వరకు మరణించిన నలుగురు శిశు మరణాలకు, నవంబర్ మాసంలో మరో ఇద్దరు మాత మరణాలకు చెందిన బంధువుల స్టేట్‌మెంట్‌ను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటిస్తాం

ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పకుండా పాటిస్తామని కలెక్టర్ జీ.లక్ష్మీశ తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో రాజకీయపార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. డీఆర్వో పెంచల కిషోర్‌తోపాటు ఈఆర్ఓ అదితి సింగ్, కిరణ్‌కుమార్, రవిశంకర్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, కోదండరామిరెడ్డి, రామ్మోహన్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డీఎస్‌టీ సెంటర్‌కు రూ.25 లక్షల గ్రాంట్ విడుదల



పత్రాలను డీఎస్‌టీ సెంటర్ కో-ఆర్డినేటర్‌కు అందజేస్తున్న వీసీ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(డీఎస్‌టీ) క్యూరీ సెంటర్‌కు కేంద్ర ప్రభుత్వం మంగళవారం రూ.25 లక్షలు గ్రాంట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా వీసీ భారతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని మహిళా వర్సిటీల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ క్యూరీ సెంటర్లను నెలకొల్పిందన్నారు. అందులో భాగంగా తిరుపతి మహిళా వర్సిటీలోని డీఎస్‌టీ సెంటర్‌కు రెండో దశ నిధులను విడుదల చేసిందన్నారు. ఈ నిధులు విద్యార్థినుల ఇంటర్న్‌షిప్‌ల కోసం, ఫ్యాకల్టీ ప్రాజెక్టులు, నేషనల్ కాన్ఫరెన్స్‌లు, ఈవెంట్‌లు, ఆగ్మెంటెడ్ రియాలిటీపై నిర్వహించే మూడు నెలల సర్టిఫికెట్ కోర్సు కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంట్‌కు సంబంధించిన పత్రాలను సెంటర్ కోఆర్డినేటర్‌కు వీసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజిని, డీఎస్‌టీ సెంటర్ కో-ఆర్డినేటర్ ఎస్ జ్యోతి, డాక్టర్ భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

అండ కరువై.. గుండె బరువై!

అల్లారు ముద్దుగా పెంచింది.. ఆప్యాయంగా గోరుముద్దలు తినిపించింది.. ఆస్తులిచ్చింది.. ఆనందంగా జీవించమంది.. జీవిత చరమాంకంలో ఆ అమ్మకు ఆసరాగా నిలవాల్సిన కూతురు తల్లికి నిలువ నీడ లేకుండా చేసింది. ఆమెను వదిలించుకోవాలని ఊరి చావడి పంచన పడేసింది. తన దారిన తాను పోయింది. ఫలితంగా ఆ తల్లి పిడికెడు మెతుకుల కోసం బిక్కుబిక్కుమంటోంది. ఈ హృదయ విదారకమైన సంఘటన మదనంబేడు పంచాయతీలో చోటుచేసుకుంది.

- మంటకలిసిన మానవత్వం
- చావడిలో తలదాచుకుంటున్న వృద్ధురాలు
- వీధిన పడేసిన కుమార్తె, బంధువులు



వృద్ధురాలు సరోజమ్మ

సత్యవేడు: మండలంలోని మదనంబేడు పంచాయతీకి చెందిన సరోజమ్మ (80)కు 20 ఏళ్ల క్రితమే భర్త చనిపోయాడు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఐదేళ్ల కిందట చనిపోయాడు. కూతురు ఉంది. వృద్ధురాలికి 80 సెంట్ల భూమి, సొంత ఇల్లు ఉండేది. కుమార్తె తల్లికి మాయ మాటలు చెప్పి ఆ భూమిని విక్రయించి, డబ్బులు తీసుకుందని స్థానికులు చెబుతున్నారు. అమ్మ నివసించే ఇంటిని కూడా వదలకుండా విక్రయించి సొమ్ము చేసుకుందని చెబుతున్నారు. గత కొంత కాలంగా వృద్ధురాలు మంచం పట్టింది. కొన్ని రోజులు తనతో మాదరపాకం(తమిళనాడు) సమీపంలోని రామాపురంలో ఉంచుకుంది. ఇటీవల తల్లిని మదనంబేడులో వదిలి వెళ్లింది. గ్రామస్తులు గుర్తించి గ్రామ చావడిలో ఆమెకు ఆశ్రయం కల్పించారు. చెవుడు, నడవలేని పరిస్థితిలో ఉన్న వృద్ధురాలు అన్నపానీయాల కోసం ఎదురు చూస్తోంది. స్థానికులు, దూరపు బంధువులు జాలి చూపి ఆహారం అందిస్తున్నారు.

పింఛన్ కూడా వాళ్లే తీసుకుంటున్నారు

ప్రభుత్వం వృద్ధురాలికి నెలనెలా పింఛన్ అందిస్తోంది. వలంటీర్ పింఛను ఇచ్చే సమయానికి వచ్చి ఆమె బంధువులు తీసుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. రూ.3 వేలు తీసుకుంటున్న వారు కనీసం వృద్ధురాలికి గుక్కెడు నీళ్లు కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు.

క్లుప్తంగా

విశ్వంలో ఉచిత నమూనా పరీక్ష రేపు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థలో ఈనెల 10వ తేదీ ఉదయం 9 గంటలకు నవోదయ నమూనా ప్రవేశ పరీక్షను ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ నెల 10వ తేదీన జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షకు అనుగుణంగా నమూనా ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నమూనా పరీక్ష ద్వారా లోపాలను సరిదిద్దుకుని ప్రధాన పరీక్షకు సంసిద్ధమయ్యేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఆసక్తి గల వారు హాల్‌టికెట్(అడ్మిట్ కార్డు) జిరాక్స్ కాపీతో నమూనా పరీక్షకు హాజరవ్వాలని, ఇతర వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఫైనాన్స్ కంపెనీ అడ్వైజర్ మృతి


మృతి చెందిన దుర్గాప్రసాద్

తిరుపతి క్రైమ్: నగరంలోని ఓ హోటల్‌లో ఫైనాన్స్ కంపెనీ అడ్వైజర్ మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి కథనం.. విజయవాడ చెందిన దుర్గాప్రసాద్(39) విజయవాడలో ఓ ఫైనాన్స్ కంపెనీకి లీగల్ అడ్వయిజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కంపెనీ పనుల నిమిత్తం సోమవారం తిరుపతికి వచ్చి హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకున్నారు. అయితే కంపెనీకి చెందిన స్నేహితులందరూ దుర్గాప్రసాద్‌కు ఫోన్ చేయగా.. ఆయన లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి రూమ్ వద్దకు వచ్చారు. మాస్టర్ కీ తో డోర్ ఓపెన్ చేయగా అప్పటికే అతను స్పృహ కోల్పోయి కనిపించాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతను మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడు భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. అయితే మృతుడికి రెండు నెలల క్రితమే గుండెకు రెండు స్టెంట్లు వేసినట్లుగా తెలిపారు. గుండెపోటుతోనే మృతి చెంది ఉండొచ్చని డాక్టర్లు అనుమానిస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జగనన్నది జనరంజక పాలన


తొండవాడలో పార్టీ జెండా ఆవిష్కరణలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి


బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన మహిళలు

- 99 శాతం హామీల అమలు
- సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: జనరంజక పాలనతో జగనన్న సంక్షేమ ఫలాలు ప్రజల చెంతకు చేర్చారని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. చంద్రగిరి మండలం, తొండవాడ, గంగుడుపల్లి, రాయలనగర్ పంచాయతీల్లో ×వై ఏపీ నీడ్స్ జగన్‌×' కార్యక్రమాన్ని చేపట్టారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఆయా పంచాయతీల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పిన హామీని నిలబెట్టుకున్న తొలి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ దేశంలోనే రికార్డు సృష్టించారని తెలిపారు. సంక్షేమానికి పెద్దపీట వేసిన ప్రభుత్వం రాష్ట్రంలో పాలన సాగిస్తోందన్నారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ఏకంగా రూ.5 లక్షల కోట్లు లబ్ధిదారులకు చేకూర్చిన మనసున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కోవిడ్ సమయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా విప్లవాత్మక చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఎంత ఖర్చు అయినా వెనుకాడకుండా ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించిన ఏకైక ప్రభుత్వం ఏపీ మాత్రమేనని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం లాంటి కీలక రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గొప్పగొప్ప సంస్కరణలు తీసుకొచ్చి అమలు చేశారని తెలిపారు. రాష్ట్రంలోనే ఏ నియోజకవర్గంలో జరగని విధంగా వందల కోట్ల నిధులతో చంద్రగిరిని అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నాయకత్వంలో రానున్న రోజుల్లో చంద్రగిరిలో మరిన్ని అభివృద్ధి, సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం వివిధ పంచాయతీల్లో రూ.22 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు రాయలపురం నుంచి తొండవాడ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బుల్లెట్ నడుపుతూ మోహిత్‌రెడ్డి పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవకు మరింత ప్రాధాన్యం


వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కొత్త కమిటీతో జిల్లా డీపీటీఓ, ఇన్‌చార్జి ఈడీ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ సేవా కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ప్రజారవాణా అధికారి(డీపీటీవో)చెంగల్‌రెడ్డి సూచించారు. మంగళవారం తిరుపతిలోని డీపీటీఓ చాంబర్‌లో ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్య, జిల్లా అధ్యక్షులు అర్జునయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ జేఎం.నాయుడు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఈ.లత, జనరల్ సెక్రటరీ డీఎస్‌పీ రావ్ నేతృత్వంలో అధికారులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ కమిటీతోపాటు పేదలకు న్యాయం జరిగేలా సేవా కార్యక్రమాలు నిర్విహంచాలని కోరారు. మంగళం డెప్యూటీ సీటీఎం భాస్కర్, డీఎం భాస్కరయ్య, అసిస్టెంట్ డీఎం నిర్మల, తులసీరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా నూతన కమిటీ

ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్‌గా ఎన్.అల్లయ్య, ప్రెసిడెంట్‌గా వీ.బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పీ.రాంబాబు, చీఫ్ అడ్వజర్స్‌గా ఎం.కామరాజు, ఎల్‌జీ నాయుడు, పీ.బాలగజపతి, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా కేఎస్.మణ్యం, కేజీ.రెడ్డి, టీవీ.రమణ, వైస్ ప్రెసిడెంట్‌గా కే.రాజశేఖర్, కే.దొరబాబు, బీఎం.మురళి, జీ.షణుగ్మం, ఎంవీ.నాయుడు, ఈవీ.శంకర్, జిల్లా కార్యదర్శిగా జీ.నరసింహులు, అడిషనల్ సెక్రటరీగా ఎస్వీ చలపతి, కోశాధికారిగా ఎం.పరశురామేశ్వర్, అసిస్టెంట్ సెక్రటరీలుగా కే.శ్రీనివాసులు, బీసీ.చంద్ర, జీకే.వర్మ, కే.రవిచంద్ర, సీ.దామోదరం, టీ.అరుణ్, జాయింట్ సెక్రటరీలుగా ఎస్ఎల్‌కే.శెట్టి, సీవీ.రమణ, ఎస్.ఫరూక్, డీ.భాస్కర్, దశరథయ్య, డీ.రాజేష్, పబ్లిసిటీ సెక్రటరీలుగా ఎం.ప్రకాష్, ఆర్.రవీంద్ర, ఏకేఎం హుసేన్, ఏ.లోకనాథం, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బీ.రాధ, కే.కల్పన, సీ.లక్ష్మి, డీ.చలపతి, ఎస్‌హెచ్ బాషా, వీజీ స్వామిలను ఎంపిక చేశారు.


వీ.బాబు, జిల్లా అధ్యక్షులు


నరసింహయాదవ్, జిల్లా కార్యదర్శి

ఉచిత శిక్షణ

తిరుపతి(అలిపిరి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ , అప్లైడ్ న్యూట్రిషన్‌లో హౌస్ కీపింగ్ ట్రైనీ, ఫుడ్ అండ్ బేవరేజెస్ సర్వీస్ అసిస్టెంట్ కోర్సుల్లో యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ తిరుపతి జిల్లా అధికారి ఆర్ లోకనాథం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై 18 నుంచి 45 సంవత్సరాలలోపు వయసున్న వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు ×స్కిల్ ఇండియా సర్టిఫికెట్×'×'తోపాటు ప్రముఖ హోటళ్లలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 11వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 8143576866, 9100558006, 9966601867 ఫోన్‌నంబర్లను సంప్రదించగలరని కోరారు.

ఎస్వీయూలో 9న జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 9వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని, సుమారు 700 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ చదివిన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు https://forms.gle/qa6D15dwmwxXv2o7 లింక్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7989810194 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.


తప్పిన పెను ప్రమాదం

టిప్పర్‌ను తప్పించబోయి.. పల్టీకొట్టిన ఆర్టీసీ బస్సు
– 24 మంది ప్రయాణికులకు గాయాలు


క్షతగాత్రులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

తిరుపతి రూరల్: ఎదురుగా వస్తున్న ప్రమాదాన్ని గుర్తించిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ తత్తరపాటులో బస్సును పక్కకి తిప్పాడు. దీంతో బస్సు రోడ్డు దిగి పక్కనే ఉన్న చెరువు గుంతలో పడి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 24 మంది రక్తగాయాలతో బయటపడ్డారు. తిరుపతి రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తిరువణ్ణామలై నుంచి తిరుమలకు వస్తోంది. మంగళవారం తెల్లవారుజామున తిరుపతి రూరల్ మండలం, గాంధీపురం పంచాయతీ పరిధిలో పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీని తప్పించబోయి అదుపుతప్పి పక్కనే గుంతలో పడింది. బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. వేగంగా వస్తున్న బస్సు ఒక్కసారిగా బోల్తా పడడంతో బస్సులోని 27 మంది ప్రయాణికులు గాయపడ్డారు. బాధితుల ఆర్తనాదాలతో గాంధీపురం గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. 108 వాహనంలో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరు పతి రుయా ఆస్పత్రికి తరలించారు. తిరుపతి రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ లారీని పోలీసులు గుర్తించారు.

వ్యవసాయ పొలాల్లో వ్యక్తి మృతదేహం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఏర్పేడు: మండలంలోని దుర్గిపేరి శివారు ప్రాంతంలోని వ్యవసాయ పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తి(45) మృతదేహం లభ్యమైందని ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపారు. దుర్గిపేరి వ్యవసాయ పొలాల్లోని వేపచెట్టుకు చొక్కాతో ఉరివేసుకుని ఓ వ్యక్తి మృతి చెందినట్టు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ జిలానీ నేతృత్వంలో మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎవరైనా గుర్తిస్తే 9440900729 ఫోన్ నంబరుకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

పంజాంలో కుక్కల స్వైర విహారం

– ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురికి గాయాలు


కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి

వెంకటగిరి రూరల్: మండలంలోని పంజాం దళితవాడలో కుక్కలు స్వైరవిహారం చేశాయి. ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురిని గాయపరిచాయి. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాలు. పంజాం దళితవాడలో కుక్కల బెడద ఎక్కువ. ఓ నివాసం వద్ద ఉన్న చిన్నారులు మానస, కార్తీక్, మాలతిపై కుక్కలు దాడికి యత్నించాయి. గమనించిన అదే ప్రాంతానికి చెందిన వీరయ్య, వరలక్ష్మి, లక్ష్మమ్మ చిన్నారులను తప్పించబోయే ప్రయత్నం చేయగా కుక్కలు వారినిపై తిరగబడి దాడి చేశాయి. ఈ మేరకు గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

స్వచ్ఛ తిరుపతికి విఘాతంపై కమిషనర్ కన్నెర్ర


దుకాణ యజమానులతో చెత్తను ఊడిపిస్తున్న కమిషనర్ అదితిసింగ్

తిరుపతి తుడా: దుకాణాల ముందు విచ్చలవిడిగా చెత్త పడి ఉండడంపై తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితిసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వచ్ఛ తిరుపతికి విఘాతం కలిగిస్తున్న దుకాణదారులపై కొరడా ఝుళిపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలకు దిగారు. దుకాణాల ముందు సంబంధిత యజమానులతో దగ్గరుండి చెత్తను ఊడిపించారు. నిషేధిత ప్లాస్టిక్ విక్రయదారులపై కఠినంగా వ్యవహరించి, ఆ షాపులను సీజ్ చేయించారు. స్వచ్ఛ పరిశీలనలో భాగంగా కమిషనర్ అదితి సింగ్ మంగళవారం హెల్త్ ఆఫీసర్‌తో కలిసి పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. చెత్త సేకరణ, తొలగింపు, పరిశుభ్రతపై పలు వార్డుల్లో తనిఖీలు చేశారు. తిరుమల బైపాస్ రోడ్డులోని ఓ కూల్ డ్రింక్ షాప్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత ప్లాస్టిక్ పెద్ద మొత్తంలో ఉండడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిమాన విధించడంతోపాటు దుకాణాన్ని సీజ్ చేసి ప్లాస్టిక్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ చెంచెయ్య పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీకి ఎంపిక


జాతీయ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికైన డిసేబుల్ క్రికెట్ జట్టు

తిరుపతి కల్చరల్: బోర్డ్ ఆఫ్ డిసేబుల్ క్రికెట్ అసోసియేషన్, రాజస్థాన్ డిసేబుల్ క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు అజ్మీర్‌లో జరగనున్న 3వ జాతీయ క్రికెట్ టోర్నమెంట్‌కు డిసేబుల్ క్రికెట్ టీంను ఎంపిక చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ నేతలతో కలిసి భీమాస్ రెసిడెన్సీ ఎండీ భీమాస్ అశోక్ జాతీయ క్రికెట్ జట్టును ప్రకటించారు. జాతీయ స్థాయి డిసేబుల్ క్రికెట్ టోర్నమెంట్ టీం కెప్టన్‌గా వీ.చిన్నమునస్వామిరెడ్డి, వైస్ కెప్టెన్‌గా ఏ.శివకోటి, సభ్యులు వై.వసంతకుమార్, వెంకట్, సాయి, కేబీ.ప్రభాకర్, అన్వేష్, మోహన్ బాబు, అంజినాయుడు, గణేష్, వెంకప్ప, సుబ్బయ్య ఏ.గణేష్, సురేంద్ర ఎంపికై నట్లు తెలిపారు. డిసేబుల్ క్రికెట్ క్రీడాకారులకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. బోర్డ్ ఆఫ్ డిసేబుల్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రామిరెడ్డి, అంతర్జాతీయ హాకీ అంపైర్, ఐఐటీ స్పోర్ట్స్ కార్యదర్శి షేక్ షంషాద్‌బేగం, ఏపీడీసీఏ ఉపాధ్యక్షుడు కేఆర్.హరిహరణ్, కార్యదర్శి వై.వసంతకుమార్ పాల్గొన్నారు.

3.5 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ ఏఆర్ విజయ్‌కుమార్, టీడీ సంధ్య

వెంకటగిరిరూరల్: రేషన్‌బియ్యం నిల్వలపై సీఎస్‌డీటీ సంధ్య దాడులు నిర్వహించి 80 బస్తాలు రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఈ ఘటన పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో చోటుచేసుకుంది. సీఎస్ డీటీ సంధ్య కథనం.. పట్టణంలోని ఎన్టీఆర్‌కాలనీలో అక్రమ రేషన్ బియ్యం నిల్వచేసినట్టు సమాచారం అందగా.. సంబంధిత అధికారులు దాడులు నిర్వహించారు. ఓ నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 80 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన నిర్వాహకులు మాసాపేటలో కూడా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్టు తెలియడంతో అక్కడికెళ్లి పరిశీలించారు. ఆ తర్వాత ఎన్టీఆర్ కాలనీలోని నివాసంలో గుర్తించి బియ్యం వద్దకు సిబ్బంది రాగా.. అక్కడ ఉన్న బియ్యాన్ని నిర్వాహకులు మాయం చేశారు. విషయం తెలుసుకున్న సంధ్య వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నిల్వచేసిన బియ్యాన్ని తమకు అప్పగించేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట వరకు అక్కడే భీష్మించుకున్నారు. మంగళవారం ఉదయం తిరుపతి విజిలెన్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మొత్తం 550 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక


కండువాలు వేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: మండలంలోని మర్రిమందలో 30 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. మంగళవారం మండలంలోని మర్రిమందలో వైఎస్సార్‌సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని టీడీపీకి చెందిన పులుసు మునిశేఖర్, చిన్న బత్తెయ్య, పెద్ద బత్తెయ్య, మణి, సుబ్రమణ్యం తదితర 30 మంది నాయకులు, కార్యకర్తలకు బియ్యపు పవిత్రారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు. సోమవారం టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి అబద్ధపు మాటలు చెప్పి తమకు పార్టీ కండువాలు వేశారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్యయాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ నాయకులు సుధీర్‌కుమార్, షేక్ మస్తాన్, రామయ్యఆచారి, గోపీరాయల్, కృష్ణారెడ్డి, గెరటయ్య, అయోధ్య పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

తిరుపతి క్రైమ్: తిరుపతి రైల్వే స్టేషన్‌లో రైల్లో నుంచి ఓ వ్యక్తి దిగుతూ అదే రైలు కిందపడి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం.. ఓ గుర్తు తెలియని వ్యక్తి కదులుతున్న హుబ్లీ ప్యాసింజర్ దిగే క్రమంలో కాలుజారి రైలు కిందపడ్డాడు. ఆ వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి ఆచూకీ తెలిస్తే రైల్వే పోలీసులు సంప్రదించాలన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు


నిందితుడు బెల్లం యేసు

తిరుపతి లీగల్: హత్య కేసులో వైఎస్సార్ కడప జిల్లా, జమ్మలమడుగు, నాగలకట్టు, సంధ్యాలమోటుకు చెందిన బెల్లంయేసుకు జీవిత ఖైదు, రూ.1,000 జరిమానా విధిస్తూ తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి టీ.రామచంద్రుడు మంగళవారం తీర్పుచెప్పారు. కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోటేశ్వరరెడ్డి, కోర్టు మానిటరింగ్ అధికారి ఈశ్వరయ్య కథనం..నిందితుడు బెల్లం యేసు మొదట్లో కారు డ్రైవరు. తన భార్య చనిపోవడంతో అతను తిరుపతికి వలస వచ్చాడు. తర్వాత అతనికి 2021 డిసెంబర్‌లో లెప్రసీ రావడంతో కరకంబాడి రోడ్డులోని ఎస్వీ పూర్ హోమ్‌లో ఉంటూ చికిత్స తీసుకుని 2022 జూన్ 3వ తేదీన డిశ్చార్జ్ అయ్యాడు. అప్పటి నుంచి అతను భిక్షగాడిగా.. పాత వస్తువుల సేకరించే వాడిగా జీవిస్తూ బస్టాపుల వద్ద నిద్రించేవాడు. ఇదిలావుండగా ముందు నుంచి గుర్తుతెలియని వ్యక్తికి, నిందితుడు యేసుకు తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. 2022 జూన్ 26న చెర్లోపల్లి–తిరుపతి మెయిన్ రోడ్డు తాటితోపు సమీపంలోని మద్యం షాపులో నిందితుడు మద్యం తాగాడు. గుర్తుతెలియని వ్యక్తి అక్కడికి రావడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మద్యం షాపు సిబ్బంది ఇద్దరినీ అక్కడి నుంచి పంపేశారు. దీనిపై కక్ష్య పెంచుకున్న నిందితుడు, గుర్తుతెలియని వ్యక్తిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలనుకున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి తాటితోపు సమీపంలోని వీరేష్ వెల్డింగ్ షాపు వద్ద మద్యం మత్తులో నిద్రిస్తుండగా రాత్రి సమయంలో వెళ్లి అతనిపై పెద్ద బండ రాయి వేశాడు. దీంతో గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. ఆపై నిందితుడు బెల్లం యేసు అక్కడి నుంచి పరారయ్యాడు. మరుసటి రోజు తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లికి చెందిన అప్పటి వీఆర్వో బీ.శ్యామల ఎమ్మార్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ పీ.సురేంద్రనాథ్‌రెడ్డి కేసు దర్యాప్తు చేసి 2022 జూలై 2వ తేదీన నిందితుడు బెల్లం యేసును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.